
# అంత్యక్రియ






మనిషిలో
మంచితనాన్ని,
మానవత్వాన్ని
పెంచి పోషించాలన్న
తపన ఈ జంట రచయితలు రచించిన
కథలలో కానవస్తుంది.

"నీ చేతిలో అదృష్ట రేఖ జెర్రిపోతులా ఉంది" అన్నాడు శాస్త్రి, ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ. ఒక మునిమాపువేళ - పుష్కరాల రేవులో మెట్లమీద, నీటి తరగల మీంచి తెరలు తెరలుగా తేలివస్తున్న మందమారుత సౌఖ్యాన్ని అనుభవిస్తూ, ఆ మాటా ఈ మాటా అయిపోయాక ఎందుకో రవి కుడిచేయి చూపితే, శాస్త్రి చూపులకు అతని చేతిలోని జెర్రిపోతు దొరికిపోయింది.

చిత్రాలు: పి.ఎస్.బాబు



ఆకలి కంటే ప్రాణికి నీడ అవసర మన్న నిత్య సత్యం మనసుకు పట్టింది.

రవి అలవోకగా నవ్వేశాడు - శాస్త్రిని అవహేళన చేసేందుక్కాదు - మంచి ఉద్యోగాలు, గొప్పింటి పిల్లలు చేయిదాటి పోయాక, అదృష్టరేఖ అంటానేవిటాని.

రవి చేతిని దొరకపుచ్చుకుని పరిశీలనలో పడ్డాడు శాస్త్రి. ఎడమ చేతిలో నిలువు రేఖనూ చూశాడు. ఒకసారి బుర్ర గోక్కున్నాడు. పుట్టిన తేదీ అడిగి తెలుసుకున్నాడు. తలమీద కొట్టుకున్నాడు. రెడ్డి ముఖంలోకి వెర్రిగా చూశాడు. రాజు వీపుకు జారగిలబడి వెలుగుకూ చీకటికీ మధ్య ఆకాశంలో జరుగుతున్న వింత యుద్ధాన్ని రెండు విఘడియల పర్యంతం విలోకించాడు.

"నువ్వే పని చేయాలోయ్" అన్నాడు రవితో. వకుళమాలికా బంపర్ లాటరీ ఆఖరు రోజు రేపేనట. టికెట్ ఖరీదు వంద రూపాయలట. మరునాడు ఉదయం తొమ్మిది గంటల ముప్పై మూడు నిమిషాల నలభై అయిదు సెకన్లకు రవి ఒక టికెట్ కొనబోతున్నాడట! అది శాస్త్రి చెప్పిన విషయం.

"తొమ్మిది వందలు పెట్టి మా ఆవిడ పట్టుచీర కొనిపెట్టమని రాత్రి కలలో పట్టుబడితే కాదన్నాను. వంద రూపాయలు లాటరీ టికెట్‌కెలా తగలేయను?" అంటూ గునిశాడు రవి.

"రవి కూడా గ్రంథసాంగుడేనన్నమాట. పట్టమహిషి లేకపోయినా, పట్టు చీరలు కొనిపెట్టమని పట్టుబట్టే కాంతలతో కలల్లో కాలక్షేపం చేస్తున్నాడంటే..." ఓ చురక వేశాడు రాజు.

రవి, శాస్త్రి, రెడ్డి, రాజు - వీళ్లు నలుగురూ పవనసుత కన్‌స్ట్రక్షన్‌లో ఉద్యోగులు. నిర్మాణ నిర్వహణలో కష్టసుఖాలు, చాకచక్యం తెలిసినవాళ్లు. బ్రహ్మచారులు కనక నలుగురూ దానవాయిపేటలో రెండు గదుల్లో అద్దెకుంటున్నారు.

అంతవరకూ క్రమంగా అలముకున్న చీకట్లలో విద్యుద్దీపాలు వెలిగాయి. వెలుగుతోపాటు నీడలు కూడా ఏర్పడ్డాయి. గోదావరి కెరటాల వెలుగు చీకట్లు కలిసి ఆటలాడుకుంటున్నాయి. మెట్ల మీంచి నలుగురూ లేచారు.

ఆ మరునాడు తలుపు టకటకలాడుతూంటే ఉలిక్కిపడి లేచాడు రవి. ఒంటిమీది రగ్గు పక్కకు తోసేసి, లుంగీ సర్దుకుంటూ తలుపు తీశాడు. ఎదురుగా శాస్త్రి, చిరునవ్వుతో.

"ఇంకా నిద్రేవిట్రా, తొందరగా తెములు" అంటూ తొందరపెట్టాడు. ఎక్కడికో, ఏమిటో అర్థం కాలేదు రవికి.

"అప్పుడే మరచిపోయావా? టైమౌతోంది... లాటరీ టికెట్" అంటూ జ్ఞాపకం చేశాడు.

రవి బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటూ "ఏదో వేళాకోళంగా అనుకున్నాం. నిజంగా కొనాలంటావా" అంటూ అడిగాడు.

"ఫస్ట్ ప్రైజ్ కోటి రూపాయలూ మనవే. పద పద" అంటూ తొందర పెట్టాడు.

నలుగురు మిత్రులూ కలిసి దేవీ చౌక్‌లో శాస్త్రి సూచించిన ముహూర్తానికి టోటల్ తొమ్మిది వచ్చే ఒక టికెట్ నూర్రూపాయలిచ్చి కొన్నారు. రవి పుట్టిన తేదీ 27 కనక - అతని లక్కీ నంబర్ తొమ్మిదనీ, దానికి అనుగుణంగానే ఆ రోజు పద్దెనిమిదనీ - ఇలా సంఖ్యాశాస్త్రంలో తనకుగల ప్రావీణ్యాన్నంతా వివరించాడు శాస్త్రి.

ఫలితాలొచ్చే పర్యంతం గడవడం బ్రహ్మప్రళయమైంది. నిజానికి రవికి దురాశేం లేదు. ఏదో సరదాగా కొన్నాం. వంద నోటుకు చెదపట్టిందనుకున్నాడు.

నాలుగో రోజు ఫలితాలు చూసి శాస్త్రి ఎగిరి గంతేశాడు. కోటి రూపాయల ఫస్ట్ ప్రైజ్ తాను కొనిపించిన టికెట్‌కు రావడంతో గొప్పతనమంతా తనదేనని కోతలు ప్రారంభించాడు. అందరూ తనను అభినందించాలనీ, సంఖ్యాశాస్త్రం నిజమని తాను నిరూపించాడు కనక తనకు ఘన సత్కారం చేయాలనీ పెద్ద గొంతుతో వాదించడం ప్రారంభించాడు.

రవికిదంతా ఎంతో ఆశ్చర్యంగా ఉంది. ఇంత డబ్బు తానేం చేసుకుంటాడు! సవాలక్ష సలహాలు కురిశాయి - కొబ్బరి తోటలు కొనమని ఒకరు, మంచి బిజినెస్ ప్రారంభించమని మరొకరు, ఫ్లాట్ల బిజినెస్ బాగుంటుందని ఇంకొకరు, లాలా చెరువు దగ్గర గార్డెన్ బార్ అండ్ రెస్టారెంట్ ప్రారంభించమని మరొకరు- ఇలా తలో రకంగా, ఎవరికి తోచింది వారు, ఎంతో ఆప్యాయత ఒలకబోస్తూ.

అందర్నీ అభినందించేవారే. కంగ్రాట్యులేషన్స్‌తో అతన్ని కంగారు పెడుతున్నారు. ఉత్సాహంగా కౌగిలించుకుంటూ ఉక్కిరి బిక్కిరి చేస్తున్నారు. ముందు మా బ్యాంక్‌లో డిపాజిట్ వేసేయండని బ్యాంకుల వాళ్లు చుట్టూ తిరగడం ప్రారంభించారు. బిస్కట్లూ కాస్త మిక్స్చరూ - టీ ఇస్తే జీడిపప్పేదన్నారు. "ఇది నా డబ్బు కాదు" అన్నాడు రవి.

రవికి గతం కళ్లముందు చిత్రపటమైంది.

తాతముత్తాతలు సంపాదించిందంతా క్రమంగా కరిగిపోతే, మిగిలింది అమ్మి ముగ్గురు ఆడపిల్లలకూ పెళ్లిళ్లు చేశాడు తండ్రి. ఆ విధంగా నీడనిచ్చే ఇల్లు కరవైంది. అద్దె కొంపల అగచాట్లు ప్రారంభమయ్యాయి. సొంత ఇల్లు లేకుండా చేశానన్న బాధతో తండ్రి కుమిలిపోతూండడం రవికి బాధ కలిగించేది. మనిషికి సొంత ఇంటి అవసరం వివరించాడాయన. మేడల అందాలు చూడనేర్చిన కంటికి పూరిగుడిసెలో, ఫ్లాటుఫారం మీద, పాడుబడిన గుడిలో, చెట్టు నీడలో, సంతపాకల్లో, డ్రెయిన్ల నిర్మాణాల కోసం ఉపయోగించే సిమెంట్ పైపుల్లో తాత్కాలిక నివాసాలు చేసేవారి అష్టకష్టాలు అర్థమయ్యాయి. ఆకలి కంటే ప్రాణికి నీడ అవసరమన్న నిత్య సత్యం మనసుకు పట్టింది. గూడు కట్టుకుందుకు ఒక పక్షి జంట పడే ఆరాటం అతను చూశాడు. లంకంత కొంపకు యజమాని అయిన ఒక అదృష్టవంతుడు పాడైపోయిన తాతల నాటి కారులో కన్ను విప్పి కాలం గడిపిన ఉదంతం విన్నాడు.

రెడ్డీ, రాజూ, శాస్త్రీ, అతని ఆలోచనాసరళికి విస్తుపోయారు. నిలువ నీడలేని

వారి కోసం చవగ్గా ఇళ్లు కట్టేందుకు లాటరీ లాభాన్ని వినియోగించాలనుకొంటున్నానని రవి సవివరంగా తెలిపాక, అతని ప్రతిపాదనను వాళ్లు బలపరిచారు. ఆ రాత్రి పొద్దుపోయేవరకూ వాళ్లిదే విషయం చర్చించారు.

లో, మిడిల్, హయ్యర్ ఇన్‌కమ్‌ల తేడాపాడాల ఆధారంగా నివాసాలను విభజించడం కూడదన్నది రవి నిశ్చితాభిప్రాయం. జాతులు, మతాలు, శాఖలతో చీలికలు పీలికలైన మానవ సమాజం ఆర్థిక అసమానతలతో మరిన్ని ముక్కలు కాకూడదన్న అతని వాదనను మిగిలిన మిత్రులు అంగీకరించారు. నాలుగు అపార్ట్‌మెంట్‌లు కలిపి ఒక యూనిట్‌గా, ప్రస్తుతం కేరళలో నిర్మిస్తున్న బెకర్ టైప్ ఇళ్ళ నమూనాలో అతి తక్కువ ఖర్చుతో నిర్మాణం సాగిస్తారు. క్రింది భాగంలో రెండు, పై భాగంలో రెండు అపార్ట్‌మెంట్‌లు మధ్య ఖాళీగా ఉండే ఇటుకలతో నిర్మిస్తారు. ఈ ఇటుకలు సిమెంటుకు బదులు ఆల్చంతో గాని, పెంకుల తయారీకి ఉపయోగించే మట్టితో గాని చేస్తారు. ఇంటి నిర్మాణంలో సిమెంటు, కర్ర ఉపయోగించేది ఉండదు. గుమ్మాలు, తలుపులు, పైకప్పు ఫెర్రో సిమెంట్‌తో నిర్మిస్తారు.

'వకుళమాలికా హౌసింగ్ స్కీం'లో అపార్ట్‌మెంట్ ఖరీదు కేవలం ఇరవై అయిదు వేల రూపాయలు. అయిదు వేలు ముందుగా చెల్లించాలి. ఆ తరువాత నెలకు రెండు వందలు.

పిడింగొయ్యిలో పదెకరాల భూమి కొన్నారు. నేలంతా చదును చేసి కాలనీలో ఒక గార్డెన్, కల్యాణ మంటపం, పాఠశాల నిర్మాణానికి అవసరమైనంత భూమి కేటాయించి ప్రతి ఇంటిని నాలుగు అపార్ట్‌మెంట్లుగా మొత్తం నూరు అపార్ట్‌మెంట్లు కేవలం నాలుగు నెలల్లో పూర్తి చేయాలని తలపెట్టారు.

అందరికీ నోరూరించే పథకమే అయినా, నియమావళి కొంచెం ఇబ్బంది కలిగించింది. అపార్ట్‌మెంట్ కోసం దరఖాస్తు చేసే వాళ్లకు దేశంలో మరెక్కడా ఇల్లుండకూడదు. ఇంటి స్థలం ఉండకూడదు. పూర్తి సొమ్ము చెల్లిస్తే పది శాతం డిస్కౌంటు. ఇన్‌స్టాల్‌మెంట్ స్కీములో పది శాతం వడ్డీ.

కొత్తదనం కొంచెం ఎబ్బెట్టుగానే ఉంటుంది. కొరుకుడు పడదు. జరుగుతున్న మాయాజాలం మేరకు ఉపకారం తలపెట్టినా మాయగానే తోస్తుంది. హౌసింగ్ స్కీం పట్ల ముందుగా ఎవ్వరూ పెద్దగా ఆసక్తి చూపలేదు. క్రమంగా దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా కురిశాయి. అయిదు వందలకు పైగా దరఖాస్తులు వచ్చాక మరో కాలనీ నిర్మాణం ప్రకటించేంత పర్యంతం దరఖాస్తులు నిలిపివేశామని ప్రకటన ఇవ్వాల్సి వచ్చింది. దరఖాస్తుల ఖరారులో దాదాపు ఇళ్లు లేని, ఆదాయం తక్కువైన, నిజమైన అవసరం గల వారిని ఎంపిక చేశారు. ఈలోగా నిర్మాణం మొదలై మూడు నెలల్లోనే కాలనీ చక్కగా తయారైంది.

టాక్స్ పోగా వచ్చిన లాటరీ సొమ్ము అరవై ఎనిమిది లక్షలు, డిపాజిట్లుగా సేకరించిన పదిహేను లక్షల్లో ఖర్చు కాగా మిగిలిన సొమ్ముతో సమీపంలోనే మరో పదెకరాలకు అడ్వాన్సు ఇచ్చి వకుళమాలికా నం. 2 కాలనీకి శంకుస్థాపన కూడా చేయించారు. అవసరమైతే అప్పుడప్పుడు సెలవు పెట్టి నలుగురు మిత్రులు రాత్రింబవళ్లు శ్రమించారు. అలవాటుగా యజమాని వెంట నడిచే కుక్క ఆ తరువాత యజమాని తలకు గొలుసు కట్టి, చేత్తో పట్టుకొని తాను ముందు నడవడం ప్రారంభించింది.

యజమాని వెంట నడిచే కుక్క తాను ముందు నడవడం ప్రారంభించింది.



రెక్కల కష్టంతో ఆహార సంపాదన ముగించుకుని పక్షులన్నీ గూళ్లకు చేరే వేళ. సాయంకాలపు నీరెండ క్రమంగా మాసిపోతున్న వేళ. కాలనీలో కల్యాణ మంటపానికి కేటాయించిన ఆరుబయట స్థలంలో కుర్చీల్లో నలుగురు మిత్రులూ చర్చల్లో పడ్డారు.

కులాలు, మతాలు, వర్గాల కారణంగా ఉద్రిక్తతలు చెలరేగి సమాజ శాంతికి భంగం కలిగిందని రవి వివరించాడు. అన్ని కులాలు కలిసి జీవించే మంచి రోజు రావాలని, అందుకు అందరూ కృషి చేయాలన్నాడు. కాలనీలో అపార్ట్‌మెంట్ల కేటాయింపులో ఒక యూనిట్‌లోని నాలుగు అపార్ట్‌మెంట్లలో నాలుగు కులాల వారు ఐకమత్యంగా జీవించాలన్నాడు.

"రాజకీయం కులాల మధ్య విభేదాలు, వివాదాలు సృష్టించింది. ఎప్పటికీ ఆరిపోని మంటను రగిలించింది. మన కాలనీ కుల సమైక్యతకు దోహదకారి కావాలి. అరమరికలు లేకుండా అందరూ కలసి మెలసి బతుకుతూ మానవులందరిదీ ఒకే జాతి అని చాటి చెప్పాలి" అన్నాడు రవి.

"మరి లాటరీ సిస్టం వద్దా?" అనడిగాడు రాజు. లాట్ పద్ధతి కూడదన్న నిర్ణయానికి నలుగురూ అంగీకరించారు. నాలుగైదు రోజుల్లో ప్రారంభోత్సవానికి నిశ్చయించారు. ముఖ్య అతిథి నిర్ణయం జరిగింది. అప్పుడు సమయం సరిగ్గా ఎనిమిదిన్నర. ప్రకాశం, సుబ్బయ్య హడావిడిగా వాళ్లు నలుగురూ కూచున్న చోటికి వచ్చారు.

"అయ్యా నాదో మనవి" అన్నాడు ప్రకాశం వినయంగా నమస్కరించి. ఉన్న కుర్చీలు నాలుగే కనుక ఆరుగురూ కిందే బైఠాయించారు.

"ఏం లేదు స్వామీ! మా కులం వాళ్ళం మొత్తం నలభై మంది ఉన్నాం. దక్షిణం వేపున్న పదిళ్లూ మాకు కేటాయించేస్తే - నలభై అపార్ట్‌మెంట్లలో మేం పడుంటాం" అన్నాడాయన.

సుబ్బయ్య మేఘం గర్జించినట్లు నవ్వేడు. "ఆ పక్కనే ఆరిళ్లున్నాయి గదండీ. అవి మాకిచ్చేయండి చాలు" అని గరగరలాడే గొంతుతో పలికాడు.

"అవన్నీ బాగా ఆలోచించి కేటాయింపులో ఒక కొత్త పద్ధతి అనుసరించాం" అన్నాడు రవి చిరునవ్వు నవ్వి.

"ఉదయమే రండి" అన్నాడు రెడ్డి.

మరునాడింకా ఎండ రాకుండానే కాలనీ అంతా పెద్ద కోలాహలంగా ఉంది. ఆఫీసు ముందు జనం తొక్కిసలాట. తమ కే అపార్ట్‌మెంట్ అలాట్ అయిందో తెల్సుకుందుకు జనం తహతహలాడుతున్నారు.

అపార్ట్‌మెంట్ల కేటాయింపులో అనుసరించిన పద్ధతి అందరికీ తెలిసిపోవడంతో పెద్ద గందరగోళం ప్రారంభమైంది. దరఖాస్తుదారుల్లో ఏయే కులాల వాళ్ళు ఎంతెంత మందున్నారో లెక్కలు తీసి వర్గాలుగా విడిపోయి సమాలోచనలు ప్రారంభించారు. అందరిలోనూ నిరాశ, ఆవేశం కనిపిస్తున్నాయి. కళ్లు ఎరుపెక్కి, ఘాటైన డైలాగులు వెలువడుతున్నాయి.

బారెడు పొద్దెక్కే వేళకు బ్యానర్లు పట్టుకుని ఒక బృందం నినాదాలు చేస్తూ కాలనీలో ప్రవేశించింది.

"కులాల వారీగా ఇళ్లు కేటాయించండి."

"కులాలను పరిరక్షించుకోవడం మనందరి కర్తవ్యం."

గంట పదయ్యే వేళకు లాఠీలు ఝళిపిస్తూ పోలీసులు రంగప్రవేశం చేశారు. దొరికిన వాళ్ళను ఉతికారు. కొందరిని దూరంగా తరిమారు. ఎ.యస్.పి. డాక్టర్ కిషోర్‌లాల్ అధ్వర్యంలో సి.ఐ. వై.జడ్.ఖాన్ శాంతిభద్రతలను అదుపులోకి తెచ్చేందుకు తక్షణ చర్యలన్నీ గైకొన్నారు. అలాట్‌మెంట్ ఏ విధంగా జరిగిందో అడిగి తెలుసుకున్నాడు. పిడింగొయ్యిలోని ఆ ప్రాంతంలో రాగల పదిహేను రోజుల పర్యంతం నూట నలభై నాల్గవ సెక్షన్ విధిస్తూ మండల రెవిన్యూ అధికారి ఆదేశాలు జారీ చేశారు. పరిస్థితి ఉద్రిక్తం కావడంతో అదనపు పోలీసు బలగాలను జిల్లా కేంద్రం నుంచి రప్పించారు. జిల్లా కలెక్టర్ ఆర్.యల్.భట్ హుటాహుటిన వచ్చి హౌసింగ్ స్కీం రికార్డులన్నీ పరిశీలించి నిర్వాహకుల లోపం ఏమీ లేదని నిర్ధారణ చేశారు. మంచిపని చేద్దామని ముందుకు వస్తే

అలా జరగడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు.


హౌసింగ్ స్కీంలోని సభ్యులంతా రాత్రికి రాత్రి రహస్య సమావేశం జరిపి, మరునాడు ఉదయం ఆర్డీఓ కార్యాలయం ముందు నిరాహారదీక్షలు చేయాలని నిర్ణయించారు. హౌసింగ్ స్కీం నిర్వాహకులు దిగిరాకపోతే ఆమరణదీక్షలు చేపట్టాలని కూడా అనుకున్నారు. ఆందోళన కమిటీ కన్వీనర్‌గా ఎం.యల్.ఏ. శ్రీ ఎ.బి.సి.రెడ్డిని ఎన్నుకున్నారు. కులాలను కాదనే హక్కు ఎవరికీ లేదనీ, కులాలను రూపుమాపేందుకు ఎవరు ప్రయత్నించినా క్షమించేది లేదనీ కుల పరిరక్షణ కమిటీ ప్రతిజ్ఞ చేసింది.

"అబ్బాయి పుట్టేడు. అయినోళ్లు, కులపోళ్లు చేరతారు. మనిసి సచ్చేడు. కులపోళ్ళే మోత్తారు. పెల్లిల్లు జరుగుతున్నాయి. కులం దాటెవడన్నా ఎల్లగలుగు తున్నాడా? ఎలెక్సన్ జరిగితే కులం సూసి సీటిత్తన్నారు. కులం లేకపోతే మనిసి లేడు" అంటూ నిరాహారదీక్షా శిబిరం ప్రారంభిస్తూ ఒక కులానికి చెందిన వృద్ధుడు ఎ.బి.సి.రావు అరవై ఆరు నిమిషాలు ప్రసంగించాడు. రాజకీయాలతో ప్రమేయం లేకుండా ఎనిమిది మంది వ్యక్తులు పెద్ద పెద్ద బొట్లు పెట్టుకుని, దండలేసుకుని ఆ రోజు నిరాహారదీక్షలో కూర్చున్నారు.

రవి, రెడ్డి, రాజు, శాస్త్రి పూర్తిగా డీలాపడిపోయారు. అయినా, రవి నిశ్చలంగానే ఉన్నాడు. మరునాడు నిరాహారదీక్షలో ఇరవై నలుగురు పాల్గొన్నారు.

"కులాలను కాపాడుకోవడం మన జన్మహక్కు" అంటూ వాళ్లు నినాదాలిచ్చారని స్థానిక దినపత్రిక 'సమాచారం' వార్త ప్రచురించింది. వకుళమాలిక అకుల మాలిక కావడానికి బదులు కులమాలిక అయిందని ఎవరో చమత్కరించారు కూడా.

మూడో రోజు ఉదయం కొందరు యువకులు రవిని కలుసుకున్నారు. కులాలు నశించాలని ఉద్యమం ప్రారంభిస్తామన్నారు. బళ్లు మూసేస్తాం - రాస్తారోకోలు జరుపుతాం అన్నారు. రవి, అతని మిత్రులు అందుకు అంగీకరించలేదు. కుల పరిరక్షణ కమిటీ ఉద్యమం తీవ్రం చేస్తోందనీ, రాస్తారోకోలు నిర్వహించేందుకు రోజుకు రెండు వేలిస్తామని వారు చెప్పారనీ, అయిదు వందలిచ్చినా తాము హౌసింగ్ స్కీం వాళ్ళ తరఫున పని చేస్తామనీ యువకులు వివరించడం రవికి ఆశ్చర్యం కలిగించింది.



పెద్ద పెద్ద బొట్లు పెట్టుకుని, దండలేసుకుని ఆ రోజు నిరాహారదీక్షలో కూర్చున్నారు.

చెప్పలేని ఒక బాధ అతనిలో ఉప్పెనలా లేచి ఊపిరాడనీయలేదు. కట్టుకున్న అందమైన ఆశాసౌధం కళ్లముందే కూలిపోయినట్లయింది.

"నా ఆలోచన మంచిది కాదేమో! నలుగురి మేలూ కోరడం నేను చేసిన తప్పు. పరిణామం ఏమైనా నేను ఎదుర్కొంటాను" అన్నాడు రవి.

యువకులు వెళ్లిపోయారు. ఒక గంట గడిచిందో లేదో బంద్ పిలుపు భూకంపంలా పట్టణాన్ని కుదిపింది.

"వకుళమాలికా హౌసింగ్ స్కీంలో జరిగిన అన్యాయానికి నిరసనగా బంద్. వెనుకబడిన తరగతులకు, షెడ్యూల్డ్ కులాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. కులాలను కాదనే హక్కు ఎవరికీ లేదు." ఆటోల ద్వారా అనౌన్స్‌మెంట్ పట్టణం నాలుగు చెరగులా వ్యాపించింది.

మరునాడు పట్టణ బంద్ జరిగింది. కాలేజీలు, బడులు మూసేశారు. చాలా మంది దుకాణాలు తెరవలేదు. రాళ్ళు విసురుతారని బస్సులు తిప్పలేదు. మధ్యాహ్నం నించి సిటీ బస్సులు తిప్పాలని ప్రయత్నించారు. కానీ, ఇస్సాసుపేట నాగుల చెరువు చేవల బజార్ దగ్గర పెద్ద గొడవైతే, పోలీసులు లాఠీ ఛార్జీ చేశారు.

"మండల్ కమిషన్ సిఫార్సుల అమలులో జాప్యం. అగ్రకులాలు డౌన్ డౌన్" అంటూ నినాదాలిస్తూ యువకులు పట్టణంలో ఉద్యమాన్ని మరో మలుపు తిప్పారు. ఇది చూసి అగ్రకులాలకు చెందిన యువకులు మరునాడు బంద్ ప్రకటించారు.

"మండల్ డౌన్ డౌన్! ప్రతిభ వర్ధిల్లాలి - కులాలెందుకు? కాలనీలో ఇళ్లు అందరికీ సమంగా పంచాలి" అంటూ నినాదాలిస్తూ యువకులు పెద్ద ప్రదర్శన జరిపారు. ముందు రోజు మాదిరిగానే రెండో రోజు కూడా దుకాణాలు మూసేశారు. బస్సులు, కార్లు నడవలేదు. రిక్షాలు తిరగలేదు.

ఆ రాత్రి మళ్లీ కొందరు యువకులు రవిని, మిత్రులను కలిశారు.

రవి వాళ్ళకు థాంక్స్ చెప్పాడు. వాళ్లు చేయి చాపినందుకు అతనికి కోపం అవధులు దాటింది. నిగ్రహించుకున్నాడు. ఆర్థిక సహకారం ఇవ్వకపోతే తాము కుల పరిరక్షణ ఉద్యమంలో చేరిపోతామని బెదరించారు.

రవి వెర్రినవ్వొకటి నవ్వి, "మీ ఇష్టం" అన్నాడు.

దాంతో కుల పరిరక్షణ ఉద్యమం బలపడింది. వరసగా మూడు రోజులు బంద్ ప్రకటించారు. ఆలోచనగల యువకుల మాట చెల్లలేదు. మరి రెండు రోజులు బంద్ పొడిగించారు.

బంద్ తీవ్ర స్థాయికి చేరుకున్న ఒక రోజు - సాయంకాలపు పొడుగాటి నీడల్లో ఇంకా వేడి తగ్గలేదు. డీలక్స్ సెంటర్‌లో పిడత కిందపప్పు ఎక్స్‌పర్ట్ అప్పారావు తన పని జోరుగా చేసుకుంటున్నాడు.

బండి చుట్టూ జనం ఉన్నారు. ఎవరేది అడిగితే అది అందిస్తూ అప్పారావు చెమటలు కక్కుతున్నాడు. ఉల్లిపాయలు తరుగుతూ, నిమ్మ చెక్కలు పిండుతూ, తిన్నవాళ్ళ దగ్గర డబ్బులు వసూలు చేసుకుంటూ, ఆ రద్దీలోనే తన సహజ ధోరణిలో జోకులు పేలుస్తున్నాడు.

ఇంతలో కొందరు బండిని చుట్టుముట్టారు. "ఏరా! బంద్ అంటే ఏంటో తెలీదురా నీకు?" అనడిగాడు ఓ లావుపాటి మీసాలబాబు.

"అయ్యా! ఇయ్యాలకి అయిదు రోజులైందండీ బడ్డీ మూసేసి..." అప్పారావు నసిగాడు.

"అయితే." "ఏం లేదండీ. ఏ పూట బియ్యం ఆ పూట కొనుక్కోవాలి బాబూ."

"అయితే?" "ఇంట్లో ముసిల్ది, మా అప్పా నలుగురు పిల్లలు వస్తులు బాబూ."

"అయితే?"

"చమించాలి బాబూ - కట్టేత్తానండీ."

"ఇంకా ఎప్పుడో కట్టేత్తాడంట. అసలు తియ్యమన్న దెవర్రా నిన్ను?" మీసాల బాబు అప్పారావు జుట్టు పట్టుకున్నాడు. నలుగురూ కలిసి బండిని తిరగబెట్టేరు. పిడత కింద పప్పు తింటూ మజాలో ఉన్నవాళ్ళ మతులు పోయాయి. వాళ్లు బెదరి పరుగుచ్చుకున్నారు. మరమరాలు, ఉల్లిపాయలు, ఉడికిన బటానీలు, నిమ్మకాయ చెక్కలు, ఉప్పు, కారం, టొమాటో, మిరపకాయ బజ్జీలు అన్నీ రోడ్డు మీద చెల్లాచెదరయ్యాయి. అక్కడేదో దుస్సంఘటన జరిగినట్లుంది. నాలుగు నిమిషాల పాటు నిశ్శబ్దం. చూస్తున్న వాళ్ల కళ్లలో ఆశ్చర్యం. ఆ దృశ్యం నిశ్చలం.

"ఇదేం అన్యాయమయ్యా" అన్నారెవరో ముసలాయన. ఆయన లాల్చీ చీలిక పీలికలైంది. మారుతి మీద వెళుతున్న ఒకాయన ఆగి, "ఎందుకొచ్చిన గొడవ" అని సలహా ఇచ్చాడు. కారుచక్రాల్లో గాలి తీసేశారు. మారుతిపై ముందంతా రాళ్ళతో తుక్కుతుక్కైపోయింది.

అప్పారావుకు కోపం కట్టలు తెంచుకుంది. అతను తనని తను సంబాళించు కోలేకపోయాడు.

"రూపాయి సంపాదించడం సేతకాని ఎదవలంతా సేరేరు. కుటుంబాన్ని పోసించు కోడం ఎంత కట్టమో మీకెలా తెలుత్తాదిరా? కులాలు కావాలంట్రా మీకు?"

గుండెల మీద చిరిగిన చొక్కా, చెదరిపోయిన జుట్టు, మండుతున్న గుండెతో అప్పారావు వీరభద్రుడిలా ఉన్నాడు. అతను యువతరాన్ని నిలదీసి ప్రశ్నిస్తున్నాడు.

చదువూ సంధ్యా తెలీని అప్పారావు, ఎవరికీ ఎప్పుడూ ఏ అపకారమూ చేయని అప్పారావు బంద్‌ల వల్ల కలిగిన బాధతో నడిరోడ్డు మీద పెద్ద పెద్ద కేకలేస్తూ శూలధారి అయి వీరనాట్యం చేసే యువకుడిలా విజృంభించాడు.

"నా బండి ఇరగ్గొట్టారు. నా బతుకుదెరువు సెడగొట్టారు. నన్నెందుకూ పనికిరాని ఎదవని సేసేరు. ఒక్క రూపాయి ఎవడైనా సాయం సేయగలర్రా! రేపణ్ణించి నాకు సిప్ప సేతికిచ్చేర్రా."

వాళ్ళు విసిరిన రాళ్ళకంటె క్రూరంగా అప్పారావు తిట్లు తగలడంతో తల తిరిగిన యువకులు తలో సందులో దూరిపోయారు.

వగిలిన అగ్నిపర్వతంలా అప్పారావు అక్కడే కూలబడిపోయాడు. ఎవరో చేయిపట్టి బండి దగ్గరకు తీసుకొచ్చారు. అతను బండి మీద పడి భోరుమన్నాడు.

అటువైపు వెళుతున్న జర్నలిస్ట్ రామచంద్రం టూటౌన్ స్టేషన్‌కు ఫోన్ చేశాడు. పదిమంది రిజర్వ్ పోలీసులతో పెట్రోలింగ్ వేన్ అటొచ్చింది. ఆ సమయానికి సందుగొందులనుంచి యువకులు వందల కొద్దీ దిగిపోయారు. అప్పారావు తిట్టాడన్న కక్ష కొద్దీ తలో రాయీ విసరడం ప్రారంభించారు. పోలీసులు వచ్చేవేళకు పరిస్థితి భయంకరంగా తయారైంది. పోలీసులు విజృంభించారు. ఎక్కడ తగులుతుందో తెలీదు. కాళ్లమీద, వీపులపైన, శిరోభాగాలపైన లాఠీలు నాట్యమాడాయి. యువకులు కకావికలయ్యారు. నలుగురు దొరికితే వాళ్ళను వేనెక్కించి, అప్పారావును ఆస్పత్రికి పంపించారు.

అదుపులోకి తీసుకున్న నలుగురు యువకులను విడుదల చేయాలని కోరుతూ పెద్ద సంఖ్యలో జనం టూ టౌన్ స్టేషన్‌పై దండయాత్ర చేశారు. రాళ్ళు విసిరారు. టెలిఫోన్ తీగలు తెంపేశారు. ఫర్నిచర్ విరిచి, బయటికి విసిరేసి, తగలబెట్టారు. సెంట్రీ కానిస్టేబుల్‌ను కొట్టారు. ఆ తరువాత గుంపు పక్కనున్న దుకాణాలకు నిప్పు పెట్టారు. క్రమంగా దావానలం పక్క పాకలకు పాకింది. విధ్వంసకాండ పట్టణమంతా చెలరేగింది. అదనపు బలగాలు వచ్చేలోగా ఉద్రిక్తత. ఘాటైన విషవాయువు మేఘం మాదిరి పట్టణాన్ని కమ్మింది. భయం జనాన్ని గడగడలాడించింది. కొన్ని పాకలు తగలబడ్డాయి. థియేటర్ అద్దాలు పగిలాయి. బండరాళ్ళను రోడ్ల మీదికి దొర్లించారు. బీభత్సం పెరగడంతో అత్యవసరంగా కర్ఫ్యూ ప్రకటించాల్సి వచ్చింది. వాహనాల కొద్దీ రక్షక భటులు ఆఘమేఘాలపై దిగారు. కర్ఫ్యూ హెచ్చరికలు చేస్తూ జీప్‌లు పట్టణాన్ని చుట్టి వచ్చాయి. అందినవారినల్లా అదుపులోకి తీసుకున్నారు. దుండగుల్లో కొందరు రహస్య స్థావరాలకు పారిపోగా, కొందరు దొరికిపోయారు. ఆ మరునాడూ కర్ఫ్యూ కొనసాగింది. మూడోరోజు మధ్యాహ్నం మూడు నుంచి ఆరు గంటల వరకూ కర్ఫ్యూ సడలించి కొనసాగించారు. ఆరు రోజుల తరువాత కానీ పట్టణంలో ప్రశాంతత చేకూరలేదు. అధికారుల సూచనలమేరకు కాలనీ ప్రారంభోత్సవం తాత్కాలికంగా వాయిదాపడింది.

బాగా చలిగా ఉంది. తెల్లవారేందుకింకా చాలా సమయం ఉంది. కల్యాణ మంటపం నిర్మించాల్సిన చోట రవి ఒక్కడూ నిశ్శబ్దంగా నుంచున్నాడు. అలలు అలలుగా ఆలోచనలున్నా అతని మెదడులో విచారం లేదు. గతం గురించే కాదు, రానున్న కాలం గురించి కూడా భయం లేదు.

వకుళమాలిక కాలనీ ప్రారంభోత్సవానికి ముహూర్త నిర్ణయం జరిగి ఏడాది గడిచింది. ఈలోగా ఎంతో కథ నడిచింది.

ఆయిదు రోజుల కర్ఫ్యూ అనంతరం, మూడు నెలల తర్వాత రవి ఒక పత్రికా ప్రకటన చేశాడు. "అన్ని కులాలు సమానమనీ, అందరూ కలిసి బతకాలనీ మా కోరిక. ఆ ఆశయం మేరకే అపార్ట్‌మెంట్ల పంపిణీ నిర్ణయించాం. నిర్మాణ వ్యయంలో ఇరవై అయిదు శాతం తగ్గింపు పద్ధతిలో వెంటనే అపార్ట్‌మెంట్లు స్వాధీనం చేసుకోండి."

కుల పరిరక్షణ సమితి సభ్యులు తమ పట్టు విడిచిపెట్టలేదు. వకుళమాలికా హౌసింగ్ స్కీం వాళ్లకు కుల పిచ్చి పట్టిందనీ, వాళ్ళు తమ పిచ్చి పట్టుదల విడిచిపెట్టకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందనీ కుల పరిరక్షణ సమితి హెచ్చరిస్తూ కరపత్రాలు విడుదల చేసింది.


హౌసింగ్ స్కీం ప్రతిపాదన పట్ల ఇష్టంలేని వాళ్ళు తమ డిపాజిట్లు తిరిగి తీసుకోవచ్చని రవి ప్రకటించగానే అందరూ ఎగబడ్డారు. ఆ సమయంలో అపార్ట్‌మెంట్ ఖరీదులో సగం సబ్సిడీ ఇస్తామన్నా వాళ్లుససేమిరా ఒప్పుకోలేదు.

"మా నియమావళి మేరకు కులాలు మరచి జీవించేవారికి అపార్ట్‌మెంట్లు ఉచితంగా కేటాయిస్తాం. నేడే రండి."

కాలనీ ముందు భాగంలో పెట్టిన ఈ బోర్డు చూసి అందరూ నవ్వుకున్నారే తప్ప ఎవరూ ముందుకు రాలేదు. రాత్రిపూట బిచ్చగాళ్ళెవరో అక్కడ తల దాచుకున్నా పొద్దుటే బోర్డు చదువుకుని— "కులాలు విడిచిపెట్టేసి బతకడం కష్టం" అనుకుంటూ తమ మూటలు సర్దుకుని పారిపోవడం ప్రారంభించారు. కులాలెరగని పక్షులు, చిలకలు, కుక్కలు, పిల్లులు కాలనీలో స్వేచ్ఛగా తిరగసాగాయి.

బాగా పెరిగిన తన గడ్డాన్ని ఒకసారి సవరించుకున్నాడు రవి. మిగత మిత్రులు తరచు కలుస్తున్నా వాళ్లు కాలనీ గురించి మాట్లాడుకోవడం మానేశారు. ఎంతో హాయిగా జరుగుతున్న ప్రయాణంలో కాలనీ నిర్మాణం ఒక దుస్సంఘటనగా తయారైంది. జనంతో కిటకిటలాడుతూ వేగంగా పరుగెత్తే రైలుపెట్టెలు పట్టాలు తప్పి పాసింజర్లను పోగొట్టుకున్నట్లు కాలనీలో అపార్ట్‌మెంట్లు బోసిగా ఉన్నాయి.

**పో**లీసులు విజృంభించారు. లాఠీలు నాట్యమాడాయి. జనం కకావికలయ్యారు.



వణకుతున్న చీకట్లో రవి నవ్వుకున్నాడు.

అందరూ కులం రహదారిలో ఎంతో గర్వంగా నడుస్తున్నారు. ఫలానా కులమని తెలిసేందుకు పేరు చివర రెండో, మూడో అక్షరాలు ధరించినవాళ్లు తమ కులం గురించి, శాఖ గురించి, కోవ గురించి ఘనంగా చెప్పుకుంటున్నారు. గాయపడిన అతని మనసు నుంచి కెరళ్ళు కెరళ్ళుగా రక్తం ఉబికి వస్తున్నట్లు బాధతో రవి రోగగ్రస్తుడిగా కనిపిస్తున్నాడు. కులం మరచిపోలేని మనుష్యులను తన దారికి తెచ్చుకునేందుకు తను చేసిన ప్రయత్నమేదీ ఫలించకపోవడం అతణ్ణి నిజంగానే ఆశ్చర్యపరచింది.

విశాలాకాశం మేఘావృతం కాగా, శంపాలత మెరిసినట్లు అతని మెదడులో ఆలోచన తళుక్కుమంది.

రేప్పొద్దున కాలనీ ముందున్న బోర్డుపై ఇలా రాయించాలి:

ఇది శ్మశానం.

కుల, మత, వర్గ ఆర్థిక ప్రాంతీయ వివక్షతలు లేకుండా ఇక్కడ అంత్యక్రియలు జరుపుకోవచ్చు.

కులాన్ని మరచి అంత్యక్రియలు జరుపుకునేందుకైనా ఎవరైనా ముందుకు వస్తారా?

రవికి నవ్వాగలేదు.

బిగ్గరగా నవ్వాడు.

తెరలు తెరలుగా - అవిరామంగా - అట్టహాసంగా శాస్త్రి మాటలు గుర్తొచ్చాయి.

"నీ చేతిలో అదృష్టరేఖ జెర్రిపోతులా ఉంది..." రవి మళ్ళీ నవ్వాడు. ●